# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 142 ప్రకాశం, శనివారం 21- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-









క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...వక్కలగడ్డ మల్లికార్జున్ నూతన గృహప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఏపీ కొండారెడ్డి, మాజీ కౌన్సిలర్ కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇస్మాయిల్, తదితరులు

## కంభం వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏసీబీ దాడులు...



క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా... మార్కాపురం జిల్లాలో పురుగు మందుల షాపు లైసెన్స్ కోసం ఒక వ్యక్తి వద్ద నుండి కంభం వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్ 20,000 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్టు సమాచారం. కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు.



క్రైమ్ కౌంటర్ న్యూస్..మార్కాపురం జిల్లా...దోర్నాల – శ్రీశైలం రహదారిలోని మల్లికార్జున నగర్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు.ఇద్దరికి గాయాలు.ధ్వంసమైన కారు ముందుబాగం, అలాగే దెబ్బతిన్న బస్సు ముందు భాగం.దర్యాప్తు చేపట్టిన పోలీసులు...!!

## ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 46 అర్జీలు



క్రైం కౌంటర్ న్యూస్ : ఏలూరు రూరల్, ఫిబ్రవరి 20 జిల్లాలో వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యో గుల సమస్యలు తీర్చేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 46 అర్జీలు అందాయి. డీఆర్వో విశ్వేశ్వరరావు, తదితర శాఖల అధికారులు పాల్గొని అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు సమస్య లను పరిష్కరించేందుకు నెలలో ప్రతి మూడో శుక్ర వారం జిల్లా స్థాయి ‘ఎంప్లాయిూస్ గ్రీవెన్స్‌డే’ నిర్వహి స్తున్నట్టు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్ర త, పదోన్నతులు, బదిలీలు ఇతర పరిపాలనా అంశా లపై వచ్చిన వినతులను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచిం చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, గృహ నిర్మాణ శాఖ డీడీ సత్యనారాయణ, డీపీవో అనురాధ, ఏపీ ఎన్జీవో జిల్లా ప్రెసిడెంటు చోడగిరి శ్రీనివాస రావు, జడ్పీ ఏవో జాన్సన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాల కంటే ప్రయాణం ముఖ్యం కాదు...

### రోడ్డు మరియు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి:ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్.,

క్రైమ్ కౌంటర్ న్యూస్...ప్రకాశం జిల్లా...ట్రాక్టర్లు, ఆటోలు, గూడ్స్ వాహనాలపై ప్రత్యేక దృష్టి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు.

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని, ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. జిల్లా ఎస్పీ , ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీసు అధికారులు మరియు సిబ్బంది వాహనదారులకు రోడ్డు మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు.

వాహనదారులు ట్రాక్టర్ల డోర్లు బయటికి తీసి వాటిపై కూలీలను కూర్చోబెట్టుకొని రహదారులపై ప్రయాణించడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, పగలు,రాత్రి సమయాల్లో కర్రలతో నిండిన ట్రాక్టర్లు రహదారులపై వెడల్పుగా ప్రయాణించడం వల్ల ఇతర వాహనదారులకు అవగాహన లేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు.

అదే విధంగా ఆటోల్లో అధిక లోడ్‌తో ప్రయాణికులను తీసుకెళ్లడం, వెనుక డోర్ తీసి ప్రయాణికులను కూర్చోబెట్టడం, డ్రైవర్ పక్కన నియమాలకు విరుద్ధంగా అదనపు వ్యక్తులను కూర్చోబెట్టడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. గూడ్స్ వాహనాల్లో(ట్రక్కు ఆటోలు, ట్రాక్టర్స్) ప్రయాణికులను తీసుకెళ్లడం కూడా చట్ట విరుద్ధమై, ప్రమాదాలకు కారణమవుతోందన్నారు.

రహదారి నియమాలను పాటించకుండా రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం ఇతర వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి, జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. వాహనదారులు రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించే విధంగా తమ వాహనాలకు రేడియం స్టికర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని సూచించారు.

ప్రమాదాల నివారణ దిశగా పోలీసు అధికారులు అవగాహన సమావేశాలు నిర్వహిస్తూ, నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరంగా



తెలియజేస్తున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు, గూడ్స్ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా నడిపినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ , హెచ్చరించారు.

ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలి. వాహనానికి సంబంధించిన పత్రాలు (డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ మొదలైనవి) వెంట ఉంచుకోవాలి. మద్యం సేవించి వాహనం నడపరాదు. ట్రాఫిక్ మరియు రోడ్డు నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ , ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.....

## 101 బస్తాల బియ్యం స్వాధీనం




లింగ సముద్రం క్రైశీ కౌంటర్ ప్రతినిధి, మండలంలోని పెద పవని లో ఉన్న శ్రీ లక్ష్మి శ్రీనివాస రైస్ మిల్లు పై ఎన్ఫోర్స్మెంటు అధికారులు డిటి కృష్ణమోహన్, రామకృష్ణ దాడి చేసి 101 రేషన్ బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తామని ఆయన చెప్పారు.ఆయన వెంట ఇన్చార్జి తహాసిల్దార్ హను మాయమ్మ, ఎఫ్ ఐ సుష్మ, తదితరులు ఉన్నారు.

## భూములను పరిశీలన

### సబ్ కలెక్టర్ డి.హిమవంశీ




వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,ఈ క్రాప్ ను సబ్ కలెక్టర్ డి.హిమవంశీ శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని చుండిలో భూముల పలు పత్రాలను ఆయన పరిశీలించారు. అయి ఆయన వెంట తహసిల్దార్ హుస్సేన్, ఎం ఆర్ ఐ ఆఫ్రీన్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాదు, విఆర్ఓ సింహాద్రి, గ్రామ సూపర్వైజర్లు సాదిక్, సింగయ్య ఉన్నారు.

## పిఆర్ శాఖ కమీషనర్ ను కలిసిన ఒంగోలు ఎంపీ మాగుంట



ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,పంచాయత్ రాజ్ శాఖా కమీషనర్ కృష్ణ తేజ ను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి గురువారం కలిశారు.

## జగన్ ను కలిసిన అంబటి రాంబాబు



క్రైమ్ కౌంటర్ న్యూస్.. వైసీపీ చీఫ్ జగన్ మోహన్ రెడ్డితో ఆ పార్టీ సీనియర్ నేత అంబటి రాంబాబు భేటీ అయ్యారు. రెండు రోజుల క్రితం ఆయన జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే అధినేతను కలిసి పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రజా పోరాటం ఆపొద్దని అంబటికి జగన్ సూచించారు. కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొందామని చెప్పారు. కొందరు పోలీసుల తీరును కూడా జగన్ తప్పుబట్టారు.

# గిరిజన విద్యార్థులకు విద్య ఉజ్వల భవిష్యత్తు లక్ష్యమే .. యం. మాలకొండ రెడ్డి



**గుడ్లూరు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,**సమాజంలో పేదరికంలో జీవిస్తున్న గిరిజన బిడ్డలకు విద్య, ఉజ్వల భవిష్యత్తు అని కావలి లోక్ అదాలత్ సభ్యులు యం.మాలకొండ రెడ్డి స్పష్టం చేశారు. మండలం లోని చేవూరు గ్రామంలోని గిరిజన గురుకుల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణంలో శ్రీ శుక్రవారం విద్యార్థులకు విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు ..

ఈ సందర్భంగా జరిగిన ఆయనమాట్లాడుతూ గిరిజనులు అభివృద్ధికి దూరంగా పేదరికంలో జీవిస్తున్నారని వారు తలరాతలు మారాలంటే వారి బిడ్డలు పాఠశాలలో చేరి విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు

విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం తల్లిదండ్రులు బిడ్డలను పాఠశాలలకుపంపాలని కోరారు, అదేవిధంగా బాల్య వివాహాల నిషేధ చట్టంపై తల్లి దండ్రులు విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్దూరు పాడు గ్రామ మాజీ సర్పంచ్ రావులకొల్లు బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు బడి బయట తిరక్కుండా, బాల కార్మికులుగా మారకుండా గురుకుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారులను చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

ఈ కార్యక్రమానికి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి అధ్యక్షులుగా వహించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుని, వారి జీవితాలు ఉన్నత విద్య దిశగా అడుగులు వేసి జీవితంలో ఎదగాలని కోరారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సతీమణి సౌజన్య పుట్టినరోజు వేడుకలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,**కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కేక్ కట్ చేసిన నేతలు, సౌజన్య గారికి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. సౌజన్య ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

పట్టణంలోని అన్న క్యాంటీన్లో సౌజన్య పుట్టినరోజు సందర్భంగా మూడు పూటలా అన్నదానం నిర్వహించారు. ఉదయం గుర్రం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అల్పాహారం అందించగా, మధ్యాహ్నం పట్టణ ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో అన్న సేవ నిర్వహించారు. సాయంత్రం పట్టణ రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లో కేక్ కట్ చేసి సౌజన్య గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు అన్న సేవ జరిగింది. ఈ కార్యక్రమాల్లో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, పార్టీ సీనియర్ నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, వడ్డెళ్ళ రవిచంద్ర, చుండూరి శ్రీను, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, కాకుమాని ప్రవీణ్, కాకుమాని మాల్యాద్రి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# దేవదేవుడిని అవమానించారు.



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 20: ఏపీ శానసమండలిలో వైసీపీ సభ్యులు శ్రీ వేంకటేశ్వర స్వామి ఫొటోలను ప్రదర్శించడం, టేబుల్పై విసిరివేయడంపై ఎన్డీఏ మిత్రపక్షాల సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదేవుడిని అవమానించడంపై మండిపడ్డారు. ఈ విషయంపై మండలి ఛైర్మన్ను కలిసి ఫిర్యాదు చేసేందుకు మంత్రి నారా లోకేశ్తో పాటు కూటమి నేతలు వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో దేవుడి చిత్రాలను ఎలా అనుమతించారని సభ్యులు ప్రశ్నించారు. వేంకటేశ్వర స్వామి చిత్రాలను ప్లకార్డులుగా ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు.చెప్పులు, షూలు వేసుకుని సభకు రావడంపైనా ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ మిత్రపక్షాల సభ్యులు.. హిందూమత సంప్రదాయాలను గౌరవించడం లేదని విమర్శించారు. వేంకటేశ్వర స్వామిని రోజూ సభలో అపవిత్రం చేస్తున్నారన్నారు. 'గోవింద గోవింద' అంటూ గోవింద నామాలపై నినాదాలు చేయడం ఏమిటని బీజేపీ నేత సోము వీర్రాజు ప్రశ్నించారు. దేవుడి ఫొటోలను టేబుల్పై విసిరేసి వెళ్లడం దేవదేవుడికే అపచారమని కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వైసీపీ సభ్యులు తక్షణమే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు సభ జరగేదిలేదని స్పష్టం చేశారు.

# తీరం కోతకు అడ్డుకట్ట

**నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీకి వీఎంఆర్డీఏ ప్రతిపాదనలు**

**సమగ్ర అధ్యయన నివేదిక అందజేత**

**రూ.203 కోట్లు ఖర్చవుతుందని అంచనా**

**నిధుల మంజూరుకు సూత్రప్రాయంగా అంగీకారం**

**వచ్చే సమావేశంలో తుది నిర్ణయం**



**క్రైం కౌంటర్ న్యూస్ :** విశాఖపట్నం, ఫిబ్రవరి 20 విశాఖపట్నం నుంచి భీమిలి వరకూ సముద్ర కోతకు గురవుతున్న 30కి పైగా ప్రాంతాలను సంరక్షించేందుకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) నడుం కట్టింది. అవకాశం ఉన్నంత మేరకు కేంద్ర నిధులు అధికంగా ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో వీఎంఆర్డీఏ ఏడాది క్రితం తీరం కోత నివారణకు సమగ్ర ప్రాజెక్టును రూపొందించింది. కేంద్రానికి సమర్పించి నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) నుంచి సాయం కోరింది. దీనికి రూ.203 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. అందులో 90 శాతం కేంద్రం సమకూరిస్తే, మిగిలిన 10 శాతం రాష్ట్రంలోని ఏపీ డిజాస్టర్ మేనేజ్మెంట్ అ?థారిటీ నుంచి తీసుకుంటామని వెల్లడించింది.

తీరం కోత నష్టాలపై నివేదిక

కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయలు మంజూరు కావాలంటే దానికి తగిన ఆధారాలు సమర్పించాలి. దీనికోసం వీఎంఆర్డీఏ పలు సంస్థలతో కలసి అధ్యయనం చేసింది. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీతో పాటు స్థానిక మత్స్యకారులతోను కలిసి మాట్లాడింది. విశాఖపట్నంలో 28.81 కి.మీ. పొడవున తీరం కోతకు గురవుతున్నట్టు గుర్తించింది. అదే విధంగా భీమిలి మార్గంలో మరో 46.2 కి.మీ. పొడవున తీరం ఓ మోస్తరుగా కోతకు గురవుతున్నదని తేల్చింది. విశాఖపట్నంలో గత ఐదు దశాబ్దాల్లో 60 వరకు తుఫాన్లు వచ్చాయని, వాటిలో 40 తీవ్రమైన నష్టం కలిగించాయని నివేదించింది. తుఫాన్లకు అలలు తీరాన్ని భారీగా తాకి పెను నష్టం కలిగిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల విశాఖలో కురుసుర సబ్మెరైన్, టీయూ–142 మ్యూజియం, గోకుల్ పార్క్, ప్రముఖ హోటళ్లు, బీచ్రోడ్డుతో పాటు మత్స్యకారుల ఆస్తులకు నష్టం జరుగుతున్నదని వెల్లడించింది. వీటి వల్ల 30 తీరప్రాంత గ్రామాలు, 60 వేల మంది జనాభా ప్రభావితం అవుతున్నారని నివేదించింది. 30 ప్రాంతాల్లో తీరం కోతకు గురవుతున్నదని పేర్కొంటూ అందులో ఆర్కే బీచ్ అధికంగా నష్టపోతున్నదని వివరించింది. పెదజాలరిపేట, మంగమారిపేట, భీమిలి...ఆ తరువాత స్థానంలో ఉన్నాయని, మిగిలిన 26 గ్రామాలకు వరదలు వచ్చినప్పుడు నష్టం జరుగుతున్నదని వెల్లడించింది.

ఢిల్లీలో సమావేశంలో చర్చ


వీఎంఆర్డీఏ చేసిన ప్రతిపాదనపై ఢిల్లీలో కేంద్ర హోం శాఖ సెక్రటరీ, ఎన్డీఎంఏ అధికారులు గురువారం సమీక్ష నిర్వహించారు. దీనికి వీఎంఆర్డీఏ నుంచి జాయింట్ కమిషనర్ రమేశ్, ఎస్ఈ భవానీశంకర్లు హాజరు కాగా, విశాఖ నుంచి కమిషనర్ తేజ్భరత్, సీఈ వినయకుమార్ వర్చువల్గా హాజరయ్యారు. పర్యాటకంగా దేశంలో ప్రజాదరణ పొందుతున్న విశాఖపట్నంలో తీరం కోత నివారణ అవశ్యమని, నిధులు మంజూరు చేయాలని అధికారులు కోరగా హోం శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. వచ్చే సమావేశంలో దీనిపై నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది.

# బీసీ హాస్టల్లో ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో సుందరరావు...



**క్రైమ్ కౌంటర్ న్యూస్.... మార్కాపురం జిల్లా....** పెద్దారవీడు గ్రామ పంచాయతీలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ ను ఎంపీడీవో జాన్ సుందరరావు ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్లో వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

# మహిళా అదృశ్యం పై రైల్వే పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు



**క్రైమ్ కౌంటర్ న్యూస్....** గుంటూరు రైల్వే స్టేషన్ రెండో నెంబర్ ఫ్లాట్ ఫామ్ పై నుండి ఈనెల 16 వ తేదీ నుండి ఒక మహిళ అదృశ్యశీ అయినట్టు పోలీసులు గుర్తించారు వివరాల్లోకి వెళితే షేక్ అఫ్రీన్ అలియాస్ సుజాత 32 సంవత్సరాల వయసు కలిగిన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం సాయిబాబా పేట చెందిన మతిస్థిమితం లేని మహిళగా గుర్తించారు ఆమె భర్త రఫీ గుంటూరు రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో వివరాలు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జిఆర్ ఎస్ఐ దీపిక తెలియజేశారు..

ఈ నెంబర్ కి దయచేసి ఫోన్ చేయండి 9247585719

# కాల్వబుగ్గ హుండీ ఆదాయం రూ.5.52 లక్షలు



**క్రైం కౌంటర్ న్యూస్ :** ఓర్వకల్లు, ఫిబ్రవరి 20 మండలంలోని కాల్వ బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ రమేష్, ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఇందులో శాశ్వత హుండీ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక హుండీ లెక్కింపులో మొత్తం రూ.5,52,410 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో శాశ్వత హుండీ లెక్కిం పులో రూ.4,50,404, అన్నదాన హుండీ రూ.20,886, తాత్కాలిక హుండీ రూ.81,120 ఆదాయం వచ్చిందని ఈవో మద్దిలేటి తెలి పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, భక్తులు గొల్ల నాగరాజు, రామగోవిందు, గువ్వ రవికుమార్, సేవకులు పాల్గొన్నారు.

# టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు భర్తను చంపేసిన భార్య



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 20 టీవీ సౌండ్ తగ్గించే విషయంలో మొదలైన చిన్న గొడవ హత్యకు దారి తీసింది. భార్య భర్తను దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన గుంటూరు జిల్లాలో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు ప్రాథమికంగా చెబుతున్న వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన షేక్ అహ్మద్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. క్రాంతి అనే యువతికి అహ్మద్ 8 నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఈ జంట కొంతకాలంగా మంగళగిరి టిడ్కో ఇళ్లలో బీ-16 బ్లాకులో నివాసం ఉంటున్నారు. అహ్మద్ రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నాడు.. గురువారం ఇంటికి వచ్చాడు. అయితే ఆ సమయంలో భార్య క్రాంతి సౌండ్ పెంచి టీవీ చూస్తోంది. ఇంట్లో టీవీ సౌండ్ ఎక్కువగా ఉండటంతో అహ్మద్.. తగ్గించమని అహ్మద్ భార్య క్రాంతికి సూచించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగిది. ఇంతలో అహ్మద్ భార్యపై చేయిచేసుకున్నాడు. ఇద్దరి మధ్య వివాదం ముదిరింది.. ఆ కోపంలో క్రాంతి అక్కడే ఉన్న ఉల్లిపాయలు కోసే కత్తి తీసుకుని భర్త అహ్మద్‌ను పొడిచింది. అయితే కొందరు స్థానికులు గమనించి అహ్మద్‌ను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అహ్మద్ అప్పటికే చనిపోయాడు. మృతుడి తల్లి మహాబీ పోలీసులకు ఫిర్యాదు చేడయంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అహ్మద్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న అహ్మద్‌కు ఏడాదిన్నర క్రితం క్రాంతితో పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది.. ఆమెకు గతంలోనే వివాహమైందట.. ఆమె భర్త జైలులో ఉన్నాడట. అహ్మద్‌తో పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. 8 నెలల క్రితం అహ్మద్, క్రాంతిలు పెళ్లు చేసుకుని మంగళగిరి టిడ్కో ఇళ్లలో బీ-16 బ్లాకులో ఉంటున్నారు. ఇంతలో టీవీ సౌండ్ విషయంలో మొదలైన గొడవలో అహ్మద్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అ'ధర'హో.. అరటి క్వింటా రూ.25 వేలు

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 20 తాడిమర్రి(అనంతపురం): పాతాళానికి పడిపోయిన అరటి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పెరుగుతూనే ఉన్నాయి. ఆకాశాన్నంటుతున్నాయి. క్వింటా ధర రూ.25 వేలకు చేరడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. లాభాలు కళ్లచూస్తున్నారు. జిల్లాలో 7,250 ఎకరాల్లో అరటి సాగుచేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పంట బాగా పండితే జిల్లా వ్యాప్తంగా 1,88,500 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ధరలు ఇలాగే కొనసాగితే జిల్లా రైతులకు రూ.377 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.నెలన్నర క్రితం పాతాళానికి..

అరటి క్వింటా ధర నెలన్నర క్రితం వరకు రూ.2 వేలు పలికింది. అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆ ధరకు విక్రయిస్తే పంట కోసే కూలీల ఖర్చులు కూడా రావని రైతులను గెలలను చెట్లపైనే వదిలేశారు. ఇంకొందరు వాటిని కోసే పశువులకు మేతగా వేశారు. ఇలా పెట్టుబడులు మొత్తంగా కోల్పోయి జిల్లాలో కోట్ల రూపాయల నష్టాలను మూటగట్టుకున్నారు. అప్పట్లో అరటి రైతు కష్టాలపై తీవ్ర చర్చ సాగింది.

పెరుగుతూనే..

పాతాళానికి పడిపోయిన అరటి ధరలు చిన్నగా పెరుగుతూ వచ్చాయి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అరటికి డిమాండ్ పెరగడంతో రోజురోజుకీ ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రూ.25 వేల వరకు టన్ను ధర పలుకుతోంది. ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెడుతున్నారు. సాగు ఖర్చులు పోను రూ.లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పండే అరటిని ఢిల్లీ, కోల్‌కతా, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

లాభాలు వస్తున్నాయి

ఆరెకరాల్లో 7,200 అరటి మొక్కలు సాగుచేశా. గెల 25 నుంచి 30కిలోల



బరువు ఉంది. రూ.625 వరకు ధర పలుకుతుంది. ఖర్చులన్నీ పోను మంచి లాభంతోనే బయటపడతాం.

-ఆదినారాయణ, రైతు, రామాపురం

20 టన్నులు వచ్చినా చాలు

అరటి ధర తక్కువగా ఉందని బాధపడేవారం. ప్రస్తుతం టన్ను రూ.25వేల వరకు పలుకుతోంది. ఎకరానికి 20 టన్నుల దిగుబడి వచ్చినా చాలు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతుంది.

-రమణ, రైతు, చిల్లకొండయ్యపల్లి

ఇలాంటి ధర కోసమే ఎదురుచూశాం

డిసెంబరులో ధరలు దారుణంగా పడిపోయాయి. తీవ్ర నష్టాలు తప్పవనుకుంటున్న తరుణంలో టన్ను రూ.22వేలతో అమ్ముతున్నాం. ఇలాంటి ధరల కోసం రెండు నెలలుగా ఎదురుచూశాం.

# నేతన్నకు కూటమి సర్కార్ తీపి కబురు

ఏడాదికి రూ.25వేల చొప్పున రూ.245 కోట్లు కేటాయింపు

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.150 కోట్లు



క్రైం కౌంటర్ న్యూస్ : సత్తెనపల్లి, ఫిబ్రవరి 20: సార్వత్రిక ఎన్నికల్లో చేనేతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరనుంది. రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నేతన్నపై వరాల జల్లు కురిపించారు. మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.25 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 81 వేల మగ్గాలకు రూ.245 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుతు రూ.150 కోట్లను కేటాయించటంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. అందులో ఏసీఐ సీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకం ద్వారా కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాది పాటు రూ.15 వేల వరకు ఆరోగ్య బీమా వర్తించేది... చేనేత కార్మికులకు వృత్తి పరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ళ నొప్పులు, కంటి చూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో చేనేత కార్మికుల కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం పాలై ఏ వైద్యశాలల్లోనైనా వైద్యం చేయించుకొని బిల్లు పెడితే రూ.15 వేలు ఇచ్చేవారు. అదే విధంగా గుణకర్ బీమా యోజన పథకంలో రూ.800 ఇన్సూరెన్స్ కల్పించే వారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60 వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ.1.50 లక్షలు ఇచ్చే వారు.

నేషనల్ హ్యాండ్ లూమ్స్ డెవలప్‌మెంట్ స్కీమ్ పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు పది శాతం రాయితీ ఇచ్చే వారు. నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ పథకంలో కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ. 50 వేలు బ్యాంక్ రుణాలు ఇచ్చేవారు. అదేవిధంగా మగ్గం నేసే కార్మికులకు వర్క్ షెడ్ కోసం రూ.75 వేలు ఇచ్చేవారు. వీటితో పాటు 2019 ఎన్నికల ముందు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై టీడీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేతన్నకు అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్న నేస్తం పేరుతో మగ్గానికి రూ.24 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది.

ఒక్కో హామీని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం నేతన్నకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. గత బడ్జెట్‌లో నేతన్నకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించి అమలు చేసింది. అంతే కాకుండా ముడినూలుపై ఉన్న ఐదు శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం భరించి రీయింబర్స్‌మెంట్ చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో వర్క్ షెడ్లు, ముద్ర రుణాలు అందజేస్తోంది. తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్లో నేతన్న భరోసా పథకానికి రూ.245 కోట్లు నిధులు కేటాయించింది. ఈ పథకంలో భాగంగా మగ్గం నేసే ప్రతి నేత కార్మికుడికి ఏడాదికి రూ.25 వేలు చొప్పన ఇవ్వనున్నారు. అదే విధంగా ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ.. అందుకోసం రూ.150 కోట్లను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంట్లోనే దుకాణం పెట్టాడు... రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు.



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 20 ఆయనో వ్యవసాయశాఖ అధికారి... ఎరువుల దుకాణంలో నకిలీ మందులు విక్రయిస్తున్నారంటూ వ్యాపారిని బెదిరించి లంచం డిమాండ్ చేశాడు... కనీసం శాంపిల్స్ కూడా సేకరించకుండా లంచం ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నిస్తే, అదంతా నాకు తెలియదు, నీ దుకాణంలో నకిలీ సరుకుందని నివేదిక పంపిస్తే నీ పని ఖతం అంటూ హుంకరించాడు... అయితే ఆ అధికారికి లంచం ఇవ్వడానికి నిరాకరించిన ఆ వ్యాపారి ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో ఇంట్లోనే లంచం తీసుకుంటున్న ఆ అవినీతి అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మార్కాపురం జిల్లా కంభం వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహమ్మద్ తన ఇంటిలో 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కాడు... కంభం మండలం తురిమెళ్ళ గ్రామానికి చెందిన ఎరువుల దుకాణదారుడు రవీంద్ర కుమార్ దగ్గర నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఒంగోలు ఏసీబీ ఇన్చార్జ్ డిఎస్పీ రామకృష్ణుడు తెలిపారు... సాధారణంగా ప్రతియేటా ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేసి నివేదికలు ఉన్నతాధికారులు పంపాల్సి ఉండగా తురిమెళ్ళలో రవీంద్ర దుకాణంలో ఎలాంటి శాంపిల్స్ సేకరించకుండానే తప్పుడు నివేదిక పంపుతానని వ్యవసాయశాఖ అధికారి షేక్ మహమ్మద్ బెదిరించాడని తెలిపారు... తన దుకాణంలో ఎలాంటి శాంపిల్స్ సేకరించకుండా అధికారి లంచం కోసం బెదిరిస్తున్నట్టు బాధితుడు తమని ఆశ్రయించడంతో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు... తర్వాత వ్యవసాయ శాఖ కార్యాలయంలో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు.

# ఆ రెండు జిల్లాల మధ్యలోనే ఫిక్స్,,,



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 20 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 9 కొత్త ఎయిర్‌పోర్టుల కోసం ప్రతిపాదనలు చేసింది. ఇప్పటికే కొన్ని విమానాశ్రయాలకు సంబంధించి భూసేకరణ, టెండర్ల ప్రక్రియ జరుగుతోంది.. కొన్నిటికి మాత్రం సర్వే జరుగుతోంది. ఏపీ ప్రభుత్వం కాకినాడ జిల్లాలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ను ప్లాన్ చేసింది. ఈ ఎయిర్‌పోర్ట్ విశాఖపట్నం, రాజమహేంద్రవరం మధ్యలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు అనువైన స్థలంపై ఇంకా క్లారిటీకి రాలేదు. అనకాపల్లి జిల్లా-కాకినాడ జిల్లాల మధ్య ఎంపికపై సందిగ్ధత కొనసాగుతోంది.

ఏపీ ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును కాకినాడ జిల్లాలోని అన్నవరం, తుని మధ్యలో నిర్మించాలని భావించింది. అయితే ఎయిర్‌పోర్ట్‌ను ప్రతిపాదించిన చోట భూములిచ్చేందుకు రైతులు ఒప్పుకోలేదు. అంతేకాదు ఆ ప్రాంతంలో సాంకేతికపరంగా సమస్యలు వచ్చాయి.. ఆ తర్వాత ప్లాన్ మార్చారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నక్కపల్లి మధ్య ఉన్న గోపాలపట్నం దగ్గర నిర్మిస్తే ఎలా ఉంటుంది అని ఆలోచన చేశారు. అయితే ఆ ప్రతిపాదనను కూడా పక్కన పెట్టారు. అయితే ఇటీవల కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనల గురించి చర్చకు వచ్చిన సమయంలో.. తుని, అన్నవరం మధ్య కొత్త ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

కాకినాడ, ఉప్పాడ సమీపంలో పరిశ్రమలు రాబోతున్నాయి. అటు అనకాపల్లి జిల్లా నక్కపల్లికి పరిశ్రమలు (బల్క్‌డ్రగ్ పరిశ్రమ, ఆర్సెలార్ మిత్తల్, ఎన్‌టీపీసీ ప్లాంట్) వస్తున్నాయి. అందుకే కాకినాడ జిల్లాలోనే ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే మరింత ఉపయోగంగా ఉంటుంది అంటున్నారు. పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతుందంటున్నారు. తునికి 100 కిలోమీటర్లదూరంలో అటు రాజమహేంద్రవరం, ఇటు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులు కూడా ఉన్నాయి. అయితే తుని దగ్గర భూములు కొత్త విమానాశ్రయానికి అనుకూలంగా లేవని గతంలో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టారు. ఇప్పుడు మళ్లీ పాయకరావుపేట సమీపంలో నిర్మించేందుకు ప్రతిపాదనల్ని పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు. మరి ప్రభుత్వం, అధికారులు ఈ కొత్త ఎయిర్‌పోర్టును ఎక్కడ ఏర్పాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే విశాఖపట్నం, రాజమహేంద్రవరానికి మధ్యలోనే ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందనే వాదనలు కూడా ఉన్నాయి.

# సినిమా



## చిరంజీవి మీద విషప్రయోగం..

ఏంటి చిరంజీవి మీద విషప్రయోగం జరిగిందా అని ఆశ్చర్యపోతున్నారు కదా..? ఇప్పుడంటే సోషల్ మీడియా యుగం కాబట్టి అన్నీ ఇట్టే తెలిసిపోతున్నాయి కానీ ఒకప్పుడు అవన్నీ ఎక్కడున్నాయి..? అందుకే చాలా విషయాలు బయటికి కూడా రాలేదు. టాలీవుడ్ ఖ్యాతిని శిఖరాగ్రానికి చేర్చిన మెగాస్టార్ చిరంజీవి ప్రస్థానం పూలపాన్పులా సాగలేదనేది అక్షర సత్యం. ఆయన సుప్రీమ్ హీరో స్థాయి నుంచి మెగాస్టార్ హోదాకు చేరుకుంటున్న తరుణంలో ఎన్నో అవాంతరాలను, కుట్రలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వాటిలో అత్యంత భయానకమైనది ఆయనపై జరిగిన ఒక ప్రాణాపాయ కుట్ర. సుమారు 28 ఏళ్ళ క్రితం ఆయనను చంపడానికి జరిగిన ఒక విషప్రయోగం అప్పట్లో దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈనాటి తరానికి పెద్దగా పరిచయం లేని ఆ నాటి దారుణ ఘటన తాలూకు వివరాలు ఇప్పటికీ ఇండస్ట్రీలో ఒక చేదు జ్ఞాపకంలా మిగిలిపోయాయి.

ఈ ఉదంతం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 1988వ సంవత్సరంలో చోటు చేసుకుంది. ఆ సమయంలో వరుసగా సూపర్ హిట్లు సాధిస్తూ టాలీవుడ్ నంబర్ వన్ హీరోగా చిరంజీవి తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. సరిగ్గా అదే సమయంలో మద్రాస్ బేస్ కోర్టు పరిసరాల్లో 'మరణ మృదంగం' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తమ అభిమాన నటుడిని నేరుగా చూసేందుకు ఆ రోజు లొకేషన్‌కు ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆ జనసందోహంలోనే ఒక గుర్తుతెలియని వ్యక్తి తన పుట్టినరోజు నెపంతో చిరంజీవి వద్దకు చేరుకున్నాడు. చిరంజీవి చేతుల మీదుగా తన బర్త్‌డే కేక్ కట్ చేయించుకోవాలనేది తన చిరకాల కోరిక అని ఆ ఆగంతుకుడు నమ్మబలికాడు. అభిమానుల పట్ల ఎప్పుడూ ఆప్యాయత చూపే చిరు, ఏమాత్రం సందేహించకుండా అందుకు అంగీకరించారు.

ఆ తర్వాత కేక్ కోసిన ఆ వ్యక్తి, అందులోని ఒక భాగాన్ని బలాత్కారంగా హీరో నోట్లోకి నెట్టే ప్రయత్నం చేశాడు. చిరంజీవి సున్నితంగా వారిస్తున్నప్పటికీ, అతడు వినకుండా మరింత బలవంతం చేయడంతో ఆ కేక్ ముక్క కింద పడిపోయింది. నేలరాలిన ఆ కేక్ ముక్కల నుంచి గోధుమ వర్ణంలో ఉన్న ఒక అనుమానాస్పద ప్యాకెట్ బయటపడటంతో అక్కడున్న చిత్ర బృందం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ కొద్దిపాటి కేక్ పెదాలకు అంటగానే చిరంజీవి పెదవుల రంగు వింతగా మారిపోవడం అందరినీ మరింత భయాందోళనలకు గురిచేసింది. ఇది కచ్చితంగా విషప్రయోగమే అని గ్రహించిన యూనిట్ సభ్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన్ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. అదృష్టవశాత్తూ తృటిలో పెను ప్రమాదం తప్పిందని వైద్యులు నిర్ధారించారు.

మరుసటి రోజు ఉదయం ఈ ఉదంతం జాతీయ, రాష్ట్ర స్థాయి పత్రికలన్నింటిలోనూ పతాక శీర్షికల్లో ప్రచురితమై తీవ్ర కలకలం రేపింది. చిరంజీవి ఎదుగుదలను ఏమాత్రం జీర్ణించుకోలేని కొందరు గిట్టనివాళ్లే ఈ పన్నాగం పన్నారంటూ పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించాయి. చివరకు సినీ పరిశ్రమకు చెందిన కొందరు పెద్దలు జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. మెగాస్టార్ తన సినీ ప్రయాణంలో కేవలం తెరమీద విలన్లనే కాకుండా, నిజ జీవితంలోనూ ఎన్నెన్నో కుట్రలను ఎదిరించి నిలబడ్డారనడానికి ఈ సంఘటనే ఒక సజీవ సాక్ష్యం. అప్పట్నుంచి చిరంజీవి విషయంలో జాగ్రత్తలు మరింతగా పెరిగిపోయాయి. ఇంత జరిగినా కూడా మెగాస్టార్ మాత్రం ఫ్యాన్స్ విషయంలో ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు.





## కూల్ డ్రింక్స్ తాగితే ఆ సమస్యలు తగ్గిపోతాయా..?

నేటి ఉరుకుల పరుగుల జీవితం, జంక్ ఫుడ్ పుణ్యమా అని ప్రతి ఇంట్లో గ్యాస్, అసిడిటీ కామన్ అయిపోయాయి. కడుపు ఉబ్బరంగా అనిపించగానే చాలామంది చేసే మొదటి పని.. వెంటనే ఒక కూల్ డ్రింక్ బాటిల్ కొని గటగటా తాగేయడం. తాగిన కాసేపటికే ఒక పెద్ద త్రేనుపు రాగానే అబ్బా.. గ్యాస్ పోయింది, హాయిగా ఉంది అని ఫీల్ అయిపోతారు. కానీ అక్కడే అసలు ప్రమాదం దాగి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీకు వచ్చే ఆ త్రేనుపు కడుపులో ఉన్న గ్యాస్ అనుకుంటే పొరపాటే. నిజానికి సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉండే కార్బన్ డయాక్సైడ్ వాయువు త్రేనుపు రూపంలో బయటకు వస్తుంది తప్ప.. మీ కడుపులోని సమస్య తగ్గదు. పైగా ఇది తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో కడుపులో ఒత్తిడిని పెంచి యాసిడ్ రిఫ్లక్స్ వంటి తీవ్రమైన వ్యాధులకు దారితీస్తుంది.

సాఫ్ట్ డ్రింక్స్ ఎందుకు డేంజర్?గ్యాస్ట్రోఎంటరాలజిస్టుల ప్రకారం.. ఈ డ్రింక్స్ తాగడం వల్ల కడుపు లోపల కొన్ని మార్పులు జరుగుతాయి. గ్యాస్ బుడగలు కడుపులో ఒత్తిడిని పెంచి, యాసిడ్ గొంతులోకి వచ్చేలా చేస్తాయి. వీటిలో ఉండే అత్యధిక చక్కెర కాలేయానికి శత్రువు. ఇది ఫ్యాటీ లివర్ సమస్యకు ప్రధాన కారణం. ఇవి స్వతహాగా ఆమ్ల గుణాన్ని కలిగి ఉండి, కడుపులోని సహజ జీర్ణ ప్రక్రియను దెబ్బతీస్తాయి. మరి పరిష్కారం ఏంటి?అసిడిటీగా ఉన్నప్పుడు కృత్రిమ డ్రింక్స్ జోలికి వెళ్లకుండా మన వంటింట్లో ఉండే ఈ సహజ ప్రత్యామ్నాయాలను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు:

అల్లం నీరు: ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది.


చల్లని పాలు: తక్కువ కొవ్వు ఉన్న చల్లని పాలు తాగితే కడుపులోని యాసిడ్ తటస్థీకరించబడుతుంది.జీలకర్ర లేదా సోంపు నీరు: గ్యాస్ సమస్యకు ఇవి శాశ్వత, సురక్షితమైన పరిష్కారాలు.హెర్బల్ టీ: ఇది కడుపులోని మంటను తగ్గించి చల్లబరుస్తుంది.



## ఉసిరితో జుట్టుకు అద్భుత ప్రయోజనాలు

ఉసిరి జుట్టు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద వైద్యులు వివరిస్తున్నారు. ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, రసాయన సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. రోజుకొక ఉసిరి తింటే జుట్టు బలంగా మారుతుంది. ఉసిరికాయల జ్యూస్ ను డైట్ లో చేర్చుకుంటే జుట్టు వత్తుగా పెరుగుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గించి, పెరుగుదలను ప్రోత్సహించడానికి ఉసిరి పొడి, నిమ్మరసం మిశ్రమాన్ని జుట్టుకు అప్లై చేసి 40 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. కొబ్బరి నూనెలో ఉసిరి చుక్కలు కలిపి మాడుకు పట్టించి, నెలలో నాలుగు సార్లు ఇలా చేస్తే జుట్టు వత్తుగా పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

1. ఉసిరికాయ జ్యూస్ నుండి: కావలసిన పదార్థాలు: ఉసిరికాయలు - 4-5 నీరు - 1/2 కప్పు తేనె లేదా బెల్లం (రుచికి తగినంత) తయారీ విధానం: ఉసిరికాయలను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయండి. బ్లెండర్‌లో ఉసిరికాయ ముక్కలు మరియు నీరు వేసి బాగా బ్లెండ్ చేయండి. జ్యూస్‌ను వడకట్టి గ్లాసులో పోయండి. రుచికి తగినంత తేనె లేదా బెల్లం కలుపుకోండి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ షాట్ తీసుకోండి.



## పుచ్చకాయ అందరికీ మంచిది కాదు.

ఎండల్లో దాహార్తిని తీర్చే పుచ్చకాయ ఆరోగ్యానికి మేలు చేసినా, కొందరికి అంత మంచిది కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, కిడ్నీ సమస్యలు ఉన్నవారు, జీర్ణకోశ వ్యాధులతో బాధపడేవారు, అతిగా తినేవారు జాగ్రత్త వహించాలి. రాత్రిపూట, ఖాళీ కడుపుతో తినడం మంచిది కాదు. రోజుకు 200-300 గ్రాములకు మించకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గర్భిణీలు, ఆరోగ్య సమస్యలున్నవారు పోషకాహార నిపుణులను సంప్రదించాలి.

జీర్ణకోశ వ్యాధులు: ఇందులో ఉండే 'లైకోపీన్' అధికమైతే గ్యాస్, కడుపు ఉబ్బరం, విరేచనాలకు దారితీస్తుంది. సున్నితమైన కడుపు ఉన్నవారు దీనికి దూరంగా ఉండటమే మేలు.వాటర్ ఇంటాక్సికేషన్: అతిగా పుచ్చకాయ తినడం వల్ల శరీరంలో సోడియం స్థాయిలు పడిపోయి 'వాటర్ ఇంటాక్సికేషన్' అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల కాళ్ల వాపులు, తీవ్రమైన అలసట కలుగుతాయి.

రాత్రిపూట వద్దు: రాత్రి సమయంలో పుచ్చకాయ తింటే జీర్ణక్రియ మందగించడమే కాకుండా, తరచుగా మూత్ర విసర్జన వల్ల నిద్రకు భంగం కలుగుతుంది.

## ముగ్గురు స్టార్ ఆటగాళ్లను పక్కనపెట్టిన సూర్య

2026 టీ20 వరల్డ్ కప్‌లో అసలైన సమరం మొదలైంది. ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం కానున్న సూపర్-8 దశ కోసం టీమిండియా సర్వసన్నద్ధమవుతోంది. గ్రూప్ స్టేజ్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి టేబుల్ టాపర్‌గా నిలిచినప్పటికీ, భారత జట్టులో కొన్ని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పసికూనలైన అమెరికా, నెదర్లాండ్స్ జట్లు కూడా భారత బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కోవడం మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెమీస్ రేసులో నిలవాలంటే కీలకమైన సూపర్-8 మ్యాచ్‌ల కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఫామ్ లేమితో సతమతమవుతున్న ముగ్గురు కీలక ఆటగాళ్లపై వేటు పడే సూచనలు ఉన్నాయి.

1. అభిషేక్ శర్మ

2025 సీజన్‌లో ఏకంగా 859 పరుగులు చేసి టీమిండియాలోకి మెరుపులా దూసుకొచ్చిన అభిషేక్ శర్మ, వరల్డ్ కప్ వేదికపై మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మొదటి మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ కనీసం ఖాతా తెరవకుండానే వెనుదిరిగి డకౌట్ల హ్యాట్రిక్ నమోదు చేశాడు. సూపర్-8లో సవాళ్లు ఇంకా కఠినంగా ఉంటాయి కాబట్టి, సూర్యకుమార్ సేన అతడిని పక్కనపెట్టి యశస్వి జైస్వాల్‌ను తిరిగి ఓపెనింగ్‌లోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. అభిషేక్ ఫామ్ లేమి భారత జట్టుకు పవర్‌ప్లేలో పెద్ద మైనస్‌గా మారింది.

2. రింకూ సింగ్

భారత నమ్మకమైన ఫినిషర్ రింకూ సింగ్ కూడా ఈ టోర్నీలో ఆశించిన ప్రభావం చూపలేకపోయాడు. అమెరికాపై 14 బంతుల్లో కేవలం 6 పరుగులే చేసిన రింకూ, మిగిలిన మ్యాచ్‌ల్లోనూ వచ్చిన స్వల్ప అవకాశాలను వినియోగించుకోలేకపోయాడు. జట్టు కూర్పు దృష్ట్యా రింకూ స్థానంలో వాషింగ్టన్ సుందర్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. సుందర్ బ్యాటింగ్‌తో పాటు అదనపు స్పిన్ బౌలింగ్ ఆప్షన్‌ను కూడా ఇస్తాడు. రింకూకు ఎక్కువ బంతులు ఆడే అవకాశం రాకపోవడం ఒక కారణమైతే, ఆరో బౌలర్ లేకపోవడం టీమ్ ఇండియాకు ప్రతికూలంగా మారింది. కాబట్టి ఆల్‌రౌండర్ కోటాలో రింకూపై వేటు పడవచ్చు.

3. అర్ష్‌దీప్ సింగ్

పేసర్ అర్ష్‌దీప్ సింగ్ భవితవ్యం పూర్తిగా పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంది. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ప్రధాన పేసర్లుగా కొనసాగుతుండటంతో, సూపర్-8 మ్యాచ్‌లు జరిగే వేదికలను బట్టి అర్ష్‌దీప్‌ను తప్పించే అవకాశం ఉంది. ముఖ్యంగా చెన్నై వంటి స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో (కులదీప్, సుందర్, అక్షర్) వెళ్లాలనుకుంటే, అర్ష్‌దీప్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుంది. శ్రీలంకలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో కూడా పాకిస్థాన్‌పై అర్ష్‌దీప్‌ను పక్కనపెట్టి కులదీప్‌ను ఆడించిన సంగతి తెలిసిందే.



## టీమిండియాకు సూపర్-8 గండం..

టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలు సిసలైన సమరం మొదలైంది. గ్రూప్ స్టేజ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టీమిండియా, ఇప్పుడు సూపర్-8 గండం దాటాల్సి ఉంది. అయితే ఈసారి పరిస్థితులు చూస్తుంటే భారత అభిమానుల్లో కాస్త టెన్షన్ మొదలైంది. ఎందుకంటే సుమారు 17 ఏళ్ల క్రితం నాటి ఒక చేదు జ్ఞాపకం ఇప్పుడు మళ్ళీ టీమిండియాను భయపెడుతోంది. 2009 తర్వాత మళ్ళీ ఇప్పుడు భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్ జట్లు ఒకే గ్రూపులో చేరడం టీమిండియాకు అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

ఏమిటా 17 ఏళ్ల నాటి బ్యాడ్ సెంటిమెంట్?

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్ జట్లు సూపర్-8లో ఒకే గ్రూపులో ఉండటం ఇది రెండోసారి మాత్రమే. గతంలో 2009 వరల్డ్ కప్‌లో సరిగ్గా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పట్లో భారత్‌తో పాటు సౌతాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లు ఒకే గ్రూపులో ఉన్నాయి. ఆ టోర్నీలో టీమిండియా ఘోరంగా విఫలమైంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వెస్టిండీస్ చేతిలో 7 వికెట్లతో, సౌతాఫ్రికా చేతిలో 12 పరుగులతో, ఇంగ్లాండ్ చేతిలో 3 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇప్పుడు మళ్ళీ అదే ఈక్వేషన్ రిపీట్ అవ్వడం అభిమానులను కలవరపెడుతోంది.

గ్రూప్ ఆఫ్ డెత్.. అందరూ అజేయులే!

ఈసారి సూపర్-8 గ్రూప్-1ని గ్రూప్ ఆఫ్ డెత్ అని పిలుస్తున్నారు. ఎందుకంటే ఈ గ్రూపులో ఉన్న నాలుగు జట్లు (భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే) గ్రూప్ స్టేజ్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అన్-బీటన్?గా ఇక్కడికి చేరుకున్నాయి. గతంలో లాగా కాకుండా ఈసారి జింబాబ్వే రూపంలో మరో ప్రమాదం పొంచి ఉంది. సికిందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే జట్టు.. ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దిగ్గజ జట్లనే మట్టికరిపించి అజేయులుగా సూపర్-8లోకి దూసుకొచ్చింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా జింబాబ్వే పెద్ద జట్ల కొంపముంచడం ఖాయం.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com